పోటీలు నిర్వహించి ప్రోత్సహించడం హర్షణీయం

జియాగూడ: నవ్య కళానికేతన్ అసోసియేషన్ ప్రతి యేటా పోటీలు విద్యార్థులకు నిర్వహించి ప్రోత్సహించడం హర్షణీయమని మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళ అన్నారు. సోమవారం ధూల్‌పేట్ జాలిహనుమాన్‌లో నవ్య కళానికేతన్ సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ద్వారా శ్రద్ధ ట్యూషన్ ట్యూటోరియల్ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు పెయింటింగ్, ఫ్యాన్సీ డ్రెస్, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పి.రవీందర్ సింగ్, అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి గోపీశెట్టి, ప్రమోద్‌కుమార్, ప్రిన్సిపాల్ వైభవ్ తదితరులు పాల్గొన్నారు.

టోలిచౌకీ చౌరస్తా సుందరీకరణ పనులు షురూ



టైల్స్ వేస్తున్న సిబ్బంది

గోల్కొండ: టోలిచౌకీ చౌరస్తా సుందరీకరణ పనులు సోమవారం షురూ అయ్యాయి. టోలిచౌకీ చౌరస్తా సుందరీకరణ పనుల్లో భాగంగా గత నెలలోనే ఫ్లై ఓవర్ పిల్లలకు ఆకట్టుకునే, ఆలోచింపజేసే చిత్రాలు, రైటప్‌లు కూడా వేశారు. చౌరస్తా వద్ద గల ఆలయం ముందు నుంచి టైల్స్ వేసే పనులు కూడా ప్రారంభమయ్యాయి.

ముగిసిన కుస్తీ పోటీలు



చాంద్రాయణగుట్ట: బార్కాస్ క్రీడా మైదానంలో హోరాహోరీగా కొనసాగిన హైదరాబాద్ కేసరి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ కుస్తీ పోటీల్లో రుస్తుం-ఇ-హైదరాబాద్‌గా షేక్ అలీ బావజీర్ నిలిచారు. బామస్ అకాడ ప్రొఫెషనల్ రెజ్లింగ్ హబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ముగిసిన ఈ పోటీల్లో హైదరాబాద్ కేసరిగా బామస్ అకాడకు చెందిన కైఫ్ బిన్ సాలం, కుమార్ కేసరిగా అహ్మద్ అలీ, బాల్ కేసరిగా పర్వేజ్, మినీ బాల్ కేసరిగా మహ్మద్ బిన్ అబ్దుల్ అజీజ్‌లు నిలిచారు. విజేతగా నిలిచిన రుస్తుం-ఇ-హైదరాబాద్ షేక్ అలీ బావజీర్‌ను నిర్వాహకులు ఖాలేద్ బామస్, అతిథులుగా హాజరైన ప్రముఖ పహిల్వాన్లు గదను అందజేసి సత్కరించారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

గోల్కొండ: ఉత్తమ సేవలకు తప్పక గుర్తింపు వస్తుందని సరోజినిదేవి కంటి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మోధిని అన్నారు. సోమవారం ఆసుపత్రి కార్యాలయ ఉద్యోగి శివకుమార్‌ను ఆమె ఉత్తమ సేవలకు గాను అభినందిస్తూ పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓ వైపు సమయ పాలన పాటిస్తూ.. మరో వైపు క్రమశిక్షణతో విధులు నిర్వహించే శివకుమార్ విధినిర్వహణలో ఎప్పుడూ ఏకాగ్రత ప్రదర్శిస్తారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ నజాఫి బేగం తదితరులున్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి



హన్మంతరావు (ఫైల్)

అఫ్జల్‌గంజ్: గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎల్.హన్మంతరావు (60) గుండె పోటుతో మృతిచెందాడు. మంగళ్‌హాట్ నయాబస్తీలో నివసించే హన్మంతరావు 30 ఏళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీ కీలక కార్యకర్తగా కొనసాగుతున్నాడు. మూడు రోజుల క్రితం అతనికి గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. ఆయన మృతిపై గోషామహల్ నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకుడు ఆల పురుషోత్తమ్‌రావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వినయ్‌కుమార్ ముదిరాజ్‌లతో పాటు పలువురు నాయకులు సంతాపం తెలిపి కుటుంబసభ్యులను ఓదార్చారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గౌలిపురా: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మొఘల్‌పురా వాటర్ ట్యాంక్ సమీపంలో గుర్తుతెలియని 50 ఏళ్ల వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు డయల్ 100 ద్వారా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వంద శాతం వ్యర్థాలమయం

- డంపింగ్ యార్డుగా మారిన శాతం చెరువు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



చెరువు కట్ట పొడవునా వ్యర్థాల డంపింగ్



చెరువు ఫెన్సింగ్ వద్ద జంతు కళేబరం

గోల్కొండ: గోల్కొండ కోట ప్రహరీ, కందకాన్ని ఆనుకొని ఉన్న శాతం చెరువు దుస్థితిని చూస్తే ఎవరికైనా అధికారుల పనితీరుపై ఆగ్రహం రాకుండా ఉండదు. చెరువు పరిసర ప్రాంతాలు చెత్తాచెదారంతో నిండి దోమలకు ఆవాసంగా మారాయి. దీంతో చెరువు ఎగువ ప్రాంతంలో ఉన్న కాలనీలవాసులు రోగాల పాలవుతున్నారు. చెరువులో ప్రతి యేటా చేపట్టే గుర్రపు డెక్క, పిచ్చి మొక్కల తొలగింపు పనులు కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. చెరువు కట్ట రానురాను కనుమరగైయ్యే దశకు చేరుకుంది. చెరువు సుందరీకరణ కోసం ప్రజాప్రతినిధులు చేస్తున్న వినతులను అధికారులను బుట్టదాఖలు చేస్తున్నారు.

తొలగించిన గుర్రపు డెక్క కట్టమీదనే..

తొలగించిన గుర్రపు డెక్క వ్యర్థాలను చెరువు కట్ట మీదనే వదిలేసి కాంట్రాక్టర్లు చేతులు దులుపుకుంటున్నారు. ఒకప్పుడు ఈ చెరువు కట్ట మీద నుంచి వెళ్లేవారు కొద్ది సేపు చెరువు కట్టపై ఆగి చెరువు అందాలను కనులారా తిలకించే వారు. ప్రస్తుతం ముక్కు మూసుకొని వెళ్తున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు కందకం, మరో వైపు శాతం చెరువు, మధ్యలోంచి గోల్కొండ జమాలి దర్వాజా నుంచి మహ్మదీ లైన్స్ వెళ్లే రోడ్డు. కాగా ఒకప్పుడు ఎంతో విశాలంగా ఉండే ఈ చెరువు కట్ట రోడ్డుపై నుంచి కేవలం ఆటోలు, ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లగలిగేందుకు చిన్నగా మారింది.

యథేచ్ఛగా వ్యర్థాల డంపింగ్...

ప్రతినిత్యం చెరువు కట్టపై క్వింటాళ్ల కొద్ది వ్యర్థాలు డంపింగ్ అవుతున్నాయి. మొదట్లో చిన్న చిన్న ఆటో ట్రాలీలు, రిక్షాలలో రాత్రి పూట చెరువు కట్టపై వ్యర్థాలు డంపింగ్ అయ్యేవి. ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో వ్యర్థాల డంపింగ్ యథేచ్ఛగా జరుగుతుంది. ప్రస్తుతం ఆటో ట్రాలీలలోనే కాకుండా డీసీఎం వాహనాలలో పెద్ద ఎత్తున వ్యర్థాలను తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. పాత ఇళ్ల కూల్చిన సందర్భంగా పేరుకుపోయిన మట్టికుప్పలు, ఇతర వ్యర్థాలు డీసీఎం వాహనాల్లో చెరువులో డంపింగ్ చేస్తున్నారు. మరో వైపు రెస్టారెంట్లు, కూరగాయల వ్యాపారులు సైతం వ్యర్థాలను పట్టపగలే ఇక్కడ డంప్ చేస్తున్నారు.

జంతువుల కళేబరాలు ఇక్కడే..

ఫిలింనగర్, జూబ్లీహిల్స్, మెహిదీపట్నం, టోలిచౌకీ తదితర ప్రాంతాల నుంచి మృతి చెందిన జంతువుల కళేబరాలు శాతం చెరువులోనే డంపింగ్ అవుతున్నాయి. కాగా కొందరు దళారులు వివిధ ప్రాంతాల్లోని వ్యర్థాలను, మృతి చెందిన జంతువుల కళేబరాలను ఇక్కడ తెచ్చి డంప్ చేస్తూ వ్యాపారం చేసుకుంటున్నారు. ఏదేమైనా శాతం చెరువును పరిరక్షించి సుందరీకరణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దశాబ్దం నుంచి పోరాడుతున్నా..



శాతం చెరువు పరిరక్షణకు గత దశాబ్దం నుంచి పోరాడుతున్నా. చెరువు సుందరీకరణ కోసం వివిధ శాఖల అధికారులను కలిశా. చెరువులో జరుగుతున్న డంపింగ్‌లను ఆపి డంపింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్‌ను కలిసి వినతిపత్రాలు ఇచ్చా. ఇంత చేస్తున్నా శాతం చెరువులో యథేచ్ఛగా వ్యర్థాలు డంప్ జరుగుతునే ఉన్నాయి. అధికారులు చెరువు పరిరక్షణ తమ బాధ్యతగా గుర్తించి చెరువు కబ్జాకోరల నుంచి పరిరక్షించాలి.

– ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్‌హాజిరీ

చారిత్రక ఆనవాళ్లు మాయం..



వందల ఏళ్ల నాటి చరిత్రకు శాతం చెరువు గుర్తుగా మిగిలి ఉంది. ఏళ్లు గడుస్తున్నా కూడా ఈ చెరువు సుందరీకరణకు నోచుకోవడం లేదు. కబ్జాదారులు పథకం ప్రకారం చెరువును కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఒకొక్కటిగా చెరువులన్నిటినీ మాయం అవుతున్నా కూడా ప్రభుత్వం నుంచి గానీ, అధికారుల నుంచి గానీ ఎటువంటి స్పందన లేదు. చెరువులోని వ్యర్థాలను తొలగించి పటిష్టమైన బౌండరీని నిర్మించాలి.

– ఆజామ్‌ఖాన్, గోల్కొండ

యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలి



నిజాం కళాశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నిజాం కళాశాలలో ఏఐఎస్‌ఎఫ్ నగర సమితి ఆధ్వర్యంలో యూజీసీ–2025 చేపట్టిన నిబంధనలను వెనక్కి తీసుకోవాలని కోరుతూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలలో వైస్ ఛాన్స్‌లర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు సంబంధించి నిబంధనల మార్పుల కోసం ఇటీవల యూజీసీ జారీ చేసిన ముసాయిదా మార్గదర్శకాలు మన ఉన్నత విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. యూజీసీ మతోన్మాద రాజకీయాలను ప్రోత్సహిస్తుందని విమర్శించారు. తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేని యెడలా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, నాయకులు జ్ఞానేశ్వర్, ప్రవీణ్, నిఖిత, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గంలో పర్యటించండి

బల్దియా కమిషనర్‌ను కోరిన ఎమ్మెల్యే



బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ఒకసారి పర్యటించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ బల్దియా కమిషనర్ ఇలంబర్తిని కోరారు. సోమవారం బల్దియా కమిషనర్‌ను కలిసి నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని స్వయంగా పర్యటించి వీటిని పరిశీలించాలని ఎమ్మెల్యే కోరారు. రూ.292 కోట్లతో జరుగుతున్న భారీ వరద నీటి పైప్‌లైన్ పనులు సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్నాయని, పనులు జరుగుతున్న ప్రాంతంలో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పనులను సకాలంలో పూర్తి చేయడం లేదని ఆయన కమిషనర్‌కు వివరించారు. టోలిచౌకీ చౌరస్తా సుందరీకరణ పనులను కూడా ఒకసారి పరిశీలించి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సంబంధిత అధికారులతో కలిసి కార్వాన్‌లో త్వరలోనే పర్యటిస్తానని కమిషనర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ..

పేదింటి ఆడపిల్లల పెళ్లిలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వరమని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. సోమవారం ఆయన మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలు నిరుపేద కుటుంబాల వారికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు.

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం ఎక్కువ



అక్బరుద్దీన్‌తో మాట్లాడుతున్న మహ్మద్ జాహెద్

గోల్కొండ: దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం ఎక్కువ అని మజ్లిస్ శాసన సభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహ్మద్ జాహెద్ సోమవారం అక్బరుద్దీన్ ఒవైసీని కలిశారు. ఈ సందర్భంగా తాను నిర్వహిస్తున్న టైలరింగ్ షాపు అభివృద్ధి చేసేందుకు అవసరమైన సహాయం ఇప్పించాలని ఆయన అక్బరుద్దీన్‌ను కోరారు. ఈ సందర్భంగా అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ..దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అంతేకాకుండా మజ్లిస్ పార్టీ దివ్యాంగులకు అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

పోచమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభం



పూజల్లో కట్టా నాగేందర్, భుజేందర్ కుమార్, పవన్‌కుమార్

అబిడ్స్: గుడిమల్కాపూర్ ప్రాంతంలో 100 ఏళ్ల క్రితం నాటి పోచమ్మ ఆలయం పునఃనిర్మాణం పనులు ప్రారంభించారు. సోమవారం బీజేపీ సీనియర్ నాయకులు భుజేందర్‌కుమార్, పవన్‌కుమార్ సహకారంతో ఆలయ పనులు ప్రారంభమయ్యాయి. గుడిమల్కాపూర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా నాగేందర్ ఆధ్వర్యంలో ఈ పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్నవారిని నాగేందర్ అభినందించారు.

‘ఎగ్జిబిషన్’లో ఆధార్ కేంద్రం ప్రారంభం



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిరంజన్, ఆదిత్య మార్గం

అఫ్జల్‌గంజ్: ఎగ్జిబిషన్ గాంధీ సెయింటనరీ కేంద్రంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, సీనియర్ సభ్యులు ఆదిత్య మార్గం సోమవారం ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆధార్ కేంద్రం పని చేస్తుందన్నారు. ఈ నెల 30వ తేదీ లోపు ఆధార్ కేంద్రాన్ని సందర్శకులు ఎవరైనా వినియోగించుకోవాలని వారు సూచించారు.

‘100శాతం రేషన్ కార్డుల సర్వే పూర్తి’

యాకుత్‌పురా: రేషన్ కార్డుల సర్వే 100 శాతం, ఇందిరమ్మ ఇళ్ల సర్వేను 80 శాతం పూర్తి చేశామని..లబ్ధిదారుల జాబితాను ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించే వార్డు సభ కార్యక్రమంలో ఆమోదించి ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీ ప్రక్రియ చేపడతామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్‌నగర్ సర్కిల్–07 డిప్యూటీ కమిషనర్ శైలజ తెలిపారు. సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే ప్రక్రియపై సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ..నూతన రేషన్ కార్డుల కోసం సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం తమ సర్కిల్ పరిధిలో మొత్తం 1517 దరఖాస్తులు రాగా ఇందులో 1434 మందిని అర్హులను గుర్తించగా 83 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 31400 దరఖాస్తులకు గాను ఇప్పటి వరకు 24342 మందిని ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టామన్నారు. సర్వేలో గుర్తించిన లబ్ధిదారుల జాబితను వార్డు సభలో ఆమోదించి పంపిణీ చేస్తారని ఆమె తెలిపారు.

దీక్ష విరమించిన బోనాల శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి అదే పేరును కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్షకు దిగిన బోనాల శ్రీనివాస్ దాదాపు 30 గంటల అనంతరం సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు విరమించారు. ఒంగోలుకు చెందిన అమరజీవి పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం అధ్యక్షుడు పెర్కం నాగాంజనేయులు ఆయనకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో అన్ని వర్గాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడదామన్నారు. నాయకులు సాంబ రవీందర్, నరేష్ దుత్వాల, ఎంకే నరేందర్, వి.నర్సింగ్‌రావు, రాచర్ల విష్ణు, నేలంటి మధు, కోల శ్రీధర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల కృషితోనే విద్యారంగం అభివృద్ధి



డీఈఓ రోహిణిని సత్కరించిన కేఆర్.రాజ్‌కుమార్, భాస్కర్ తదితరులు

అబిడ్స్: ఉద్యోగుల కృషితోనే విద్యారంగం అభివృద్ధి చెందుతుందని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి పేర్కొన్నారు. ఉద్యోగులందరూ క్రమశిక్షణతో కృషి చేస్తున్నందున విద్యారంగం ముందుకు వెళ్తుందన్నారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో పనిచేసే విజయలక్ష్మి, సుగుణారెడ్డి, జయంతి రెడ్డి, ఫయాజ్, ముక్తదర్, మహ్మద్ ముజాహిద్ అలీ, దేవిప్రసాద్, రమేష్, పవన్, పరమేష్‌లకు ఆమె ఉత్తమ అవార్డులు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా రోహిణి మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రజిత, ప్రవీణ, రాణి, ప్రవీణ్, కేఆర్.రాజ్‌కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ పత్తర్‌గట్టి విద్యుత్ ఫీడర్ పరిధిలోని చెత్త బజార్, దివాన్‌దేవుడి, నయాపూల్, మదీనా, పత్తర్‌గట్టి, గుల్జార్ హౌజ్, రికాబ్‌గంజ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. గుల్జార్‌హౌస్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని గుల్జార్‌హౌస్, చార్ కమాన్, మామా జుమ్లా పాటక్, మిట్టికా షేర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే అలీజా కోట్ల విద్యుత్ ఫీడర్ పరిధిలోని అలీజాకోట్ల, మీరాలంమండి, కాళీ కమాన్, ఫంజేషా తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్ నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

జీఎం చావుని విద్యుత్ ఫీడర్ పరిధిలోని జీఎం చావుని, ఛత్రినాక, కందికల్ గేట్, వీవీనగర్, అయోధ్యనగర్, హనుమాన్‌నగర్, ఉప్పుగూడ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. సాయిబాబా నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పార్వతీ నగర్, కందికల్ గేట్, అశోక్ నగర్, సాదిక్ నగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే మేతర్వాడి విద్యుత్ ఫీడర్ పరిధిలోని సుల్తాన్ షాహి, మేతర్వాడి, గౌలిపుర తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

గోశాల విద్యుత్ ఫీడర్ల పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11కేవీ సమర్థ నారాయణ, గోశాల విద్యుత్ ఫీడర్ల పరిధిలోని సమర్థ నారాయణ ఆశ్రమం, సంజయ్‌నగర్, ఎంసీహెచ్ క్వార్టర్స్, శివాజీ విగ్రహం,హత్తీ బౌలీ పోలీస్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే సబ్జిమండి, డాల్ఫిన్ హోటల్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని సబ్జిమండి, పోస్ట్ ఆఫీస్, ఆర్‌ఎస్ ఆలయం, గోపీ హోటల్, డాల్ఫిన్ హోటల్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న నాగేశ్వర్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని పద్మశ్రీ పురస్కార గ్రహీతలు డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, పుల్లెల గోపీచంద్ అన్నారు. సోమవారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అనంత్ బజాజ్ మెమోరియల్ తెలంగాణ రాష్ట్ర ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రతిభను కనబరిచారు. అండర్–11 బాలికల విభాగంలో జరిగిన ఫైనల్ పోటీల్లో శాన్వి లట్టాల, ఎవిలిన్ ప్రియాంక జోడిలు ఫైనల్ పోటీల్లో గెలిచి బంగారు పతకాన్ని పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ బాడ్మింటన్ క్రీడాకారుడు హెచ్‌ఎస్.ప్రణయ్, మ్యాచ్ పాయింట్ అకాడమీ వ్యవస్థాపకులు ముప్పాల వేణు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



వీల్‌చైర్ అందజేస్తున్న రవితేజ

విజయనగర్‌కాలనీ: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆ పార్టీ ఆసిఫ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కె.రవితేజ అన్నారు. డివిజన్‌కు చెందిన పార్టీ కార్యకర్త సురేష్ తల్లికి చేయూతనిచ్చేందుకు సోమవారం వీల్‌చైర్‌ను రవితేజ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, రాష్ట్ర వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.వీరయ్య సహకారంతో డివిజన్‌లో సంక్షేమా కార్యక్రమాలు చేపట్టేందుకు చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలి

సుల్తాన్‌బజార్: అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇళ్లు లేని వారికి సొంత ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ..అధికారం చేపట్టి ఏడాది గడిచినా ఒక్క రేషన్‌కార్డు, ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని గోషామహల్ బీఆర్‌ఎస్ నేత ఆనంద్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. సోమవారం గౌలిగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ 13 నెలలు గడిచినా నేటికి పేదలకు ఒక్క ఇంటిని కూడా మంజూరు చేయలేదని ధ్వజమెత్తారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు విజయ్ ముదిరాజ్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్

కార్మికులు, మహిళలకు సన్మానం



జియాగూడ: ప్రభుత్వ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను, ఇటీవల వివిధ పోటీల్లో గెలుపొందిన మహిళలను కార్వాన్ శివ శంకర క్రాంతి సేవా సమితి సన్మానించడం హర్షణీయమని హైదరాబాద్ విభాగ్ రాష్ట్రీయ సేవక్ సమితి విశ్రాంత ఉపాధ్యాయురాలు వెదుల సుధామని అన్నారు. సోమవారం క్రాంతి భవన్‌లో శివ శంకర క్రాంతి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమితి అధ్యక్షుడు పడాల అనంత కృష్ణ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వే ఆఫ్ ఇండియా అధికారి ముల్లె రాకేష్, జేఎస్‌ఎస్ మాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సైలు అమర్‌నాథ్‌రెడ్డి, నగూర్ పాషా

యాకుత్‌పురా: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి నగరంలోకి ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ డ్రైవర్లకు సూచించారు. రోడ్డ భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం దారుషిఫా సాలార్‌జంగ్ రోటరీ వద్ద ట్రాఫిక్ నిబంధనలపై ఎస్సైలు, సిబ్బందితో కలిసి డ్రైవర్లకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు అమర్‌నాథ్ రెడ్డి, నగూర్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పురాతన నాణేల సేకరణల ప్రదర్శన



నాణేలు తిలకిస్తున్న ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ

చార్మినార్: పాతబస్తీ మొఘల్‌పురాలోని ఉర్దూఘర్‌లో మూడ్రోజుల పాటు సాగిన అంతర్జాతీయ నాణేలు, కరెన్సీ నోట్లు, పురాతన వస్తువుల సేకరణల ప్రదర్శన సోమవారంతో ముగిసింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీజే అబ్దుల్ కలాం ఆజాద్‌సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న ప్రారంభమైన ఎగ్జిబిషన్‌లో 20 స్టాళ్లు ఏర్పాటు చేశారు. 7వ శతాబ్దం నాటి పురాతన నాణేలు, కరెన్సీలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ముగింపు సందర్భంగా చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ పాల్గొని ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అమెరికాకు చెందిన ఒక బృందం ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించి నిజాం కాలం నాటి కరెన్సీని ఖరీదు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్య నిర్వాహక కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీతో పాటు సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. మూడ్రోజుల్లో దాదాపు 10 వేల మంది సందర్శించినట్లు సిరాజుద్దీన్ తెలిపారు.